# మానవ జీవితమంతా యజ్ఞస్వరూపమే

జపయజ్ఞములందె జన్మలన్నియు పోయె
మనసు కుదరదాయె మానవునకు
జప యజ్ఞములు సలుప జన్మమీదేరునా
మనసు నిలుపకున్న మందమతికి

**దివ్యాత్మ స్వరూపులారా!**

యజ్ఞయాగాది క్రతువులకు, దానధర్మాది కర్మలకు, జపతపాది సాధనలకు ఆలవాలమై పుట్టినిల్లుగా పెట్టిన పేరుగా ప్రసిద్ధిగాంచిన త్రేతాయుగము నందు మానవత్వాన్ని ప్రకటించే నిమిత్తమై, దివ్యత్వాన్ని వ్యాపింప చేసే నిమిత్తమై జనక చక్రవర్తి గొప్ప యజ్ఞమును ప్రారంభించాడు. అనేకమంది మునులను, యోగులను, రాజయోగులను, పండితులను ఆహ్వానించాడు. వీరిద్వారా యజ్ఞము అత్యంత వైభవముగా దిగ్విజయముగా జరిపాడు. కడపటి దినము గొప్ప సమావేశము జరిపాడు ఈ జనక చక్రవర్తి. ఇందులో ఎవరైనా బ్రహ్మవేత్త ముందుకు రావలెనని ప్రార్థించాడు. అనేకమంది మునులందు, మహర్షులందు కొంత సంశయములు ప్రారంభమైనాయి. కాని ఎట్టి సంశయము లేక ధైర్యముతో యాజ్ఞవల్క్యుడు ముందుకు వచ్చాడు. జనకచక్రవర్తి దీనికి పూర్వమే ఏర్పాటుగావించుకొన్నట్లుగా వేయి గోవులను సర్వాలంకారముగావించి వాటిని ఈ బ్రహ్మవేత్త తీసుకుని పోవలెనని ఆశించాడు. ఈ మాటలను విన్న తక్షణమే తన శిష్యులను లేపి ఈ గోవులను తన ఆశ్రమమునకు తీసుకు పొమ్మని ఆజ్ఞాపించాడు. యజ్ఞమునకు యజమానియైన అశ్వలుడులేచి యాజ్ఞవల్క్యా! నీవు బ్రహ్మవేత్తవన్న దానిని ఋజువు పరచిన తర్వాతనే ఈ గోవులను నీవు తీసుకొనిపోవుటకు అధికారమున్నదిగాని, అట్లు ఋజువు చేయుటకు పూర్వము నీకు ఈ గోవులను తీసుకొని పోవుటకు అధికారము లేదు అని అడ్డగించాడు.

srisathyasaivachanamrutam

దీనిని పురస్కరించుకొని యాజ్ఞవల్క్యుడు అనేకమంది పండితులను ఋషులను అనేక విధములుగా ప్రశ్నిస్తూ వచ్చాడు. ఎవరూ ఈ యాజ్ఞవల్క్యునియొక్క ప్రశ్నలకు సరైన జవాబులివ్వలేకపోయారు. ఈ విధంగా సభ నిశ్శబ్దంతో, నిర్మలమైన భావముతో నిలచిఉండిన సమయములో అశ్వలుడు లేచి 'మృత్యువును అధిగమించటానికి ఏది మార్గము?' అని అడిగాడు. దానిని యాజ్ఞవల్క్యుడు 'వాక్కు' అని జవాబిచ్చాడు. ఈ వాక్కే అగ్ని. వాక్కుద్వారా అగ్ని సహాయముతో, అగ్నిరూపముతో మృత్యువును అధిగమించవచ్చును అన్నాడు. ఈ అధిగమించుటయే ముక్తియనికూడా జవాబిచ్చాడు. దీనికి సరైన రీతిలో జవాబు చెప్పమని మరొక తూరి ప్రశ్నించాడు అశ్వలుడు. పుట్టినప్పుడు తల్లి గర్భము ఒక అగ్ని గుండము, దీనియందే ఈ శరీరము అనేక విధములైన అంగములతో కూడి ఉంటుంది. గర్భాగ్ని అంత్యమొందిన తరువాత చితాగ్ని ఈ శరీరాన్ని భస్మముగావిస్తుంది.

రూపములను గావించునది అగ్నియే. రూపములను నిర్మూలము గావించునదిఅగ్నియే. అగ్నికి మించినది మరొకటి ఈ జగత్తునందు లేదని జవాబిచ్చాడు. ఇంకనూ ఈ సభయందున్నవారు ఈ బ్రహ్మవేత్త అనే దానిని సరైన రీతిలో ఋజువు పొందేనిమిత్తమై అనేకమంది అనేక ప్రశ్నలు వేస్తూ వచ్చారు. తదుపరి ఉద్దాలకుడు లేచాడు 'యాజ్ఞవల్క్యా! గ్రహము లెన్నియో చెప్పగలవా?' అని అడిగాడు. ఈనాడు రాహువు, కేతువు అని ఇలాంటి గ్రహములంతా మనము ఉచ్చరిస్తూ ఉంటాము. ఆనాడు ఈపేర్లు లేవు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ప్రాణము, వాక్కు, జిహ్వ, కన్ను, చెవులు, చేయి, మనసు, చర్మము ఇవియే అష్టగ్రహములన్నాడు. దానితో ఉద్దాలకుడు కూర్చున్నాడు.

**మహాసాధ్వి గార్గి**

ఆనాడు జనక చక్రవర్తి కొలువునందు అద్వితీయమైన పండితురాలు, గొప్ప జ్ఞానవేత్త, మహాసాధ్వీమణి గార్గి. ఆమె సున్నితమైన స్వరముతో, మధురమైన వాక్కుతో 'యాజ్ఞవల్క్యా! దేవతలెందరో నీవు చెప్పగలవా?' అని అడిగింది. మంచివారినుండి మంచి మాటలే వస్తూ ఉంటాయి. అటూ ఇటూ విచారించక 3,306 మంది దేవతలని జవాబిచ్చాడు. అప్పుడు గార్గి ఇంకను ఈ దేవతలను తగ్గించి చెప్పగలవా అని అడిగి తదుపరి ఈమె 33 మంది దేవతలతో

srisathyasaivachanamrutam

నీవు దీనిని ముగించమని ఆమె ప్రశ్నించేటప్పటికి 8 మంది వసువులు, 11 మంది రుద్రులు, 12 మంది ఆదిత్యులు, ఒక ఇంద్రుడు, ఒక ప్రజాపతి. ఇవే 33 మంది దేవతలు అన్నాడు. మరల ఈమె దీనిని వదల లేదు. 'యజ్ఞవల్క్యా 33 మంది దేవతల నుండి 6 మందిగా నీవు వీరిని తగ్గించి చెప్పుటకు వీలవుతుందా?' అని ప్రశ్నించింది. చెప్పాడు. అగ్ని, వాయువు, ప్రకృతి, ఆదిత్య, ఆదిత్య మండలము, ద్యులోకమని జవాబిచ్చాడు. ఆమె మరింత తెలివితేటలు గల్గినది. ఆమె బ్రహ్మవేత్తనే. దీనితో తృప్తిపడక దీనిని మూడుగా మార్చటానికి వీలవుతుందా అని అడిగింది. త్రిలోకములే త్రిమూర్తి స్వరూపములన్నాడు. దేవలోకము, మానవ లోకము, దైత్యలోకము, దేవలోకముకు దమము, మానవలోకమునకు ధర్మము, దైత్యలోకమునకు దయ ఇవే దేవతలు అన్నాడు. కాని గార్గి అంతటితో తృప్తి పడేటటువంటిది కాదు. మరల ప్రశ్నవేసింది. దీనిని రెండుగా మార్చటానికి సాధ్యమవుతుందా అని అడిగింది. ప్రాణము, అన్నము అన్నాడు. మరొక చిక్కు ప్రశ్న వేసింది ఆమె, 'రెండు దేవతలను ఒకటిన్నర దేవతగా మార్చటానికి సాధ్యమవుతుందా?' అనింది. సభలోనున్న పండితులు, ఋషులు ఈ ప్రశ్నకు చాలా కంగారు పడ్డారు. దేవతలు ఇద్దరు ఉండవచ్చును ముగ్గురు ఉండవచ్చును ఆరు మంది ఉండవచ్చును. ఒకటిన్నర దేవతలుంటారా అని అందిరికి ఒక అపోహ కలిగింది. మహా బ్రహ్మవేత్త కనుక యాజ్ఞవల్క్యుడు వాయువు అన్నాడు.

ఆమె తిరిగి ప్రశ్నించింది. వాయువైతే ఒకేదేవత అవుతుంది గాని ఒకటిన్నర దేవత అవటానికి వీలు లేదే అని ప్రశ్నించింది. వాయువు సర్వపదార్థములందు ఉంటుంది కనుక దీనిని అద్వర్ధమని అంటారు. అద్వర్ధమనగా ఒకటిన్నర అని దీనికి అర్థము అన్నాడు. తదుపరి ఒక దేవతగా నీవు చెప్పగలవా అని అడిగింది. అదే ప్రాణము అన్నాడు. ఏకోహం బహుశ్యాం ఉన్నది ఒక్కటే అయినప్పటికి అనేక విధములుగా తానే రూపము ధరించి తనకు తానే సంకల్పించుకొని భిన్నరూపములుగా రూపొందింపచేసుకుంటారు. ఉన్నది ఒక్కటే అయినప్పటికి అనేకమంది విప్రులు దానిని అనేకరూపములుగా దర్శించి అనేక నామములు స్థాపిస్తారు. ఏకం సత్ విప్రాబహుధా వదంతి' ఉన్న సత్యం ఒక్కటేగాని దానిని అనేక రూపములుగా రూపొందింప చేసుకుంటారు అన్నాడు. దీనికి గార్గి చాలాసంతసించి ఇతను బ్రహ్మవేత్త. జనక మహారాజు ఆస్థానములో ఉండటానికి వీలవుతుందని అద్వితీయమైన పండితునిగా

sri sathyasai vahini

రూపొందించమని ఆమె జనకుని ప్రార్థించింది. అంతటితో యాజ్ఞవల్క్యుడు తనప్రసంగమును మానక అక్కడ అందరికి సుబోధ గావించటానికి పూనుకున్నాడు.

తల్లి బిడ్డను ప్రేమిస్తుంది. బిడ్డ తల్లిని ప్రేమిస్తున్నాడు. భార్య భర్తను ప్రేమిస్తుంది. భర్త భార్యను ప్రేమిస్తున్నాడు. అన్నతమ్ముని ప్రేమిస్తున్నాడు. తమ్ముడు అన్నను ప్రేమిస్తున్నాడు. ఇదేవిధముగనే కొంతమంది ధనమును ప్రేమిస్తున్నారు. కొంతమంది వస్తువులను ప్రేమిస్తున్నారు. కొందరు విద్యను ప్రేమిస్తున్నారు. ఎవరినిమిత్తమై వీరు ప్రేమిస్తున్నారు ఎవరు ప్రేమిస్తున్నారు? భార్య నిమిత్తమై భర్త భార్యను ప్రేమించటం లేదు. తల్లి తన బిడ్డనిమిత్తమై తల్లి తన బిడ్డను ప్రేమించటం లేదు. ఎవరి నిమిత్తమై వారు వారిని ప్రేమిస్తున్నారేగాని ఒకరినిమిత్తమై ఒకరు ఒకరిని ప్రేమించటంలేదని నిర్ణయము చేసినాడు. ఈ అనురాగములన్నియు ఆత్మానురాగముతో కూడినవే. కాని దేహానురాగముతో కూడినవి కావు. ఇప్పుడు నేనీ వస్తువును ప్రేమిస్తున్నాను. ఈ వస్తువు నిమిత్తమై నేను ఈ వస్తువును ప్రేమిస్తున్నానా, నా నిమిత్తమై నేనీ వస్తువును ప్రేమిస్తున్నాను. అదేవిధముగా ప్రపంచములో ఉన్న సమస్త పదార్థములను వ్యక్తులు ప్రేమిస్తున్నారంటే పదార్థముల నిమిత్తమై వస్తువును ప్రేమించటం లేదు. తమ నిమిత్తమై ఆ వస్తువును ప్రేమిస్తున్నారు. తమను తాము ప్రేమించుకోవటమనగా ఏమిటి? తమ ఆత్మానురాగమునే తాము నిరూపిస్తూ వస్తున్నారు.

ఆత్మ అనగా ఏమిటి? వాక్కు, మనస్సు, ప్రాణము ఈ మూడింటియొక్క బృహత్తర స్వరూపమే. ప్రాణము ఎక్కడనుంచి వచ్చింది? మనస్సు ఎక్కడ నుండి వచ్చింది? యాజ్ఞవల్క్యుడు చెప్పాడు, 'మానవుడు భుజించే ఆహారములో స్థూలమైనది మలరూపకముగను, అతిసూక్ష్మమైనది మనస్సు రూపకంగా రూపొందుతుంది. మానవుడు గ్రోలే జలముద్వారా అతి స్థూలమైనది మూత్రరూపముగను, సూక్ష్మమైనది ప్రాణరూపం ధరిస్తోంది. వాక్కు తేజోమయరూపాన్ని ధరిస్తుంది. వాక్కు అనే తేజస్సు అన్నమయమైన దేహమును రసమయమైన ప్రాణంలో అంకితము గావిస్తుంది. మనస్సు, వాక్కు, ప్రాణము ఈ మూడింటియొక్క చేరికనే ఆత్మ అంటున్నారు కదా! ఆత్మకు ఒకే రూపంగాని ఈ మూడుకాదే అని గార్గి అడ్డు తగిలింది. అప్పుడు చెప్పాడు. నలుపు, తెలుపు, ఎరుపు ఇవి అగ్నికి సహజ గుణములు. ఈ మూడును

srisathyasaivachanamrutam

వేరుకాదు. అగ్ని ఎఱ్ఱగా కనుపిస్తుంది. తెల్లని స్వరూపాన్ని ధరిస్తుంది. ఆరినప్పుడు నల్ల స్వరూపాన్ని పొందుతుంది. నలుపు రాత్రియొక్క చిహ్నము. ఎఱుపు ఉషస్‌యొక్క చిహ్నము. తెలుపు పగటి చిహ్నము. ఈ మూడింటియందు ఉన్న సూర్యుడు ఒక్కడే. ఇట్టి ఏకత్వముగా ఉన్న ఆత్మ అనేక సమయములందు అనేక స్వరూపములను ధరిస్తుంది. కనుకనే ఆత్మసంబంధమైన విషయాన్ని ఎవ్వరూ కూడను ఇట్టిది అట్టిది అని నిర్ణయించుటకు అధికారములేదని గర్జించాడు.

అయితే దీనిలో గార్గి తృప్తి పడక ఎన్నివిధములైన మనుష్యులు ఈ జగత్తునందు ఉన్నారు అని మరొక ప్రశ్న వేసింది. నాల్గు రకములైన మనుష్యులు ఈ జగత్తునందున్నారు అన్నాడు. ఒకటి మనుష్య దేవత. రెండు మనుష్య మనిషి. మూడు మనుష్య దైత్యుడు, నాలుగు మనుష్య పశువు. ఈ నాలుగు రకములైన మనుష్యులు ఈ జగత్తునందున్నారని నిర్ణయించాడు. బ్రహ్మజ్ఞుడైన మనిషి దైవము. సత్యధర్మములతో కూడినవాడు మానవుడు అన్నాడు. బ్రహ్మజ్ఞత్వముతో ఉండి, నిరంతరము బ్రహ్మ భావమునే చింతిస్తూ సర్వత్రా కూడా బ్రహ్మమునే దర్శిస్తూ, స్వార్థము స్వప్రయోజనము లేకుండా కాలమును గడిపేవాడు బ్రహ్మజ్ఞుడైన మనిషి. సర్వులయందు ఉండిన దివ్యత్వం ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి, రూప నామములు విసర్జించి నిత్యచైతన్యమును మాత్రమే తాననుభవించే స్వభావము బ్రహ్మజ్ఞము. ఈ విధమైన ప్రవర్తనల చేత మానవత్వాన్ని అనుభవించేవాడు మానవదైవత్వమన్నారు.

మానవ మానవత్వము. సత్యము చేతను, ధర్మము చేతను తనకాలమును పవిత్రము గావించుకుంటూ, తనయొక్క కర్తవ్య కర్మల నాచరించుకుంటూ, దానధర్మాలు సల్పుకుంటూ మానవులతో సమత్వమైన జీవితాన్ని గడుపుకుంటూ, ఎవరినీ హింసించక, ఎవరినీ బాధించక సర్వులనూ ప్రేమిస్తూ, మానవతా విలువలైన ఈ సత్యధర్మములను నిత్యమైన మార్గములో క్షణక్షణము మరువకుండా ఆచరిస్తూ వచ్చేవాడు నిజమైన మానవుడు.

సురాపానము గావిస్తూ తన యదార్థమైన మనసును మరచి తన్మయుడై, మత్తుడై, ఉన్మత్తుడై నోటికి వచ్చినట్లు ఇతరులను దూషించటము, ఇతరులను బాధించటము, హింసించటము, తనయొక్క స్వార్థమునే జీవితమని భ్రమించిన వాడు మానవదైత్యుడు.

ఆహార నిద్ర భయమైథునములయందే తన జీవితమును గడుపుతూ తిండి తీర్థాదులే ప్రధానమైన లక్ష్యములని భావిస్తూ జగత్సంబంధమైన విషయములలో దేనియందు ప్రవేశించక, విచక్షణా జ్ఞానహీనుడై, దానధర్మములనే భావములు ఏమాత్రము చింతించక, సత్యమార్గమంటే ఏమిటో గుర్తించలేక, పశువులవలె తన దేహముయొక్క భోగభాగ్యములను మాత్రమే దృష్టియందుంచుకొని జీవించేటటువంటివాడు మానవపశువు అన్నాడు.

**అహంకారము విడనాడండి**

ఈ విధముగా బ్రహ్మవేత్తయైన యాజ్ఞవల్క్యుడు నిత్య జీవితములో మానవత్వములో ఉండిన దివ్య రహస్యములను చక్కగా ఆ సమావేశములో అందరికి తెలుపుతూ వచ్చాడు. ఏతావాతా దీనియొక్క రహస్యాన్ని మనము విచారించినప్పుడు యాజ్ఞవల్క్యాది క్రతువులు దేనినిమిత్తమై ఆచరిస్తూ వచ్చేవారనేది విచారణ చేస్తే మానవత్వమును ప్రకటితము గావించే నిమిత్తము, దివ్యత్వమును గుర్తించే నిమిత్తము, పవిత్రముగా గడిపే నిమిత్తము, పరమార్థమును అర్థము చేసుకునే నిమిత్తము, మానవత్వమును మరచి దైవత్వములో లీనము గావించే నిమిత్తమై ఈ యజ్ఞయాగాదులు ప్రారంభమయ్యాయి. స్వర్గము కావలెనని గాని, మనోభీష్టము నెరవేరాలనిగాని ఆనాడు యజ్ఞయాగాదులు సల్పలేదు. దురదృష్టవశాత్తు కాలము గడిచేకొలది ఈ పవిత్రత అంతా మరుగునపడుతూ వచ్చింది. ప్రతిదానికి స్వార్థము స్వార్థము స్వప్రయోజనము. త్యాగమనే భావము యేకొంసయందు కనిపించటం లేదు. త్యాగమే ప్రధానమైన యజ్ఞముగా రూపొందుతూ వచ్చింది.

మానవ జీవితమంతయు ఒక యజ్ఞ స్వరూపమే. తాను చేసే ప్రతికార్యము కూడను యజ్ఞముయొక్క ప్రతిబింబములే. ప్రతిదానియందు త్యాగమనే భావమును అభివృద్ధి పరచుకోవాలి. ఏపని చేసినా తన నిమిత్తముగా తాను భావించాలి. తానంటే ఎవరు? తాను ఆత్మస్వరూపుడుగా విశ్వసించిరి. నేను ఎవరికోసమో ఇంతత్యాగము చేశాను, నేను ఎవరికోసమో సేవలు చేశాను అని భావించేవాడు పరమ అజ్ఞాని. నేను చేస్తున్నాను అనే భావము అహంకారమునకు కారణమవుతుంది. అహంకార రహితుడై అభిమానమును త్యజించి కర్తవ్య కర్మలు నిర్వర్తించే దీనియందు సత్యధర్మములను లక్ష్యమునందుంచుకోవాలి.

srisathyasaivachanamrutam

ఇట్టి మానవత్వాన్ని ఈనాడు లోకములో స్థాపించే నిమిత్తమే ఈ ఆధ్యాత్మిక కర్మలు ఆచరించటానికి ఒకకారణమయింది. ఎక్కడ చూసినా ఈనాడు యజ్ఞములని చెప్తున్నారు. ఈనాటి యజ్ఞములన్నియు ఒక వ్యాపారరంగముగా రూపొందుతున్నాయి. ఎప్పుడు తన చేతిలో డబ్బు తగ్గిపోతుందో అప్పుడంతా ఏదో ఒక యజ్ఞమని ప్రారంభిస్తున్నారు. కారణమేమిటి తన నిమిత్తమై యజ్ఞము లాచరించటం, యజ్ఞమని చెప్తే అమాయక ప్రజలు డబ్బు నందిస్తారు. ఆ వచ్చిన ధనములో కొంతవరకు ఖర్చుపెట్టి మిగిలినది స్వార్థముగా ఉపయోగించుకుంటాడు. ఈనాడు ప్రతికార్యము ఇదే విధమైనదిగా రూపొందుతున్నాది. సత్కర్మలన్నియు త్యాగభావము చేత స్వార్థ రహితమైన తలంపుచేత తను ప్రారంభించాలి. త్యాగము లేని మానవునకు ఏనాటికి శాంతి లభించదు. నిరంతరము పైకినవ్వినట్టుగా కనుపిస్తాడు గాని లోపలంతా కుమిలిపోతుంటాడు.

ప్రేమ స్వరూపులారా! ప్రధానమైన విషయము మీరు గుర్తించాలి. పరమ భక్తులమని, సాధకులమని, జ్ఞానులమని మీరు భావిస్తూ ఉండవచ్చు. మొట్టమొదట మీరు అహంకారము నిర్మూలము గావించుకోండి. ఆడంబరములకు ఏమాత్రము అవకాశము ఇవ్వవద్దు. త్యాగభావము చేత సేవలు చేయండి. ఇదియే ఒక పెద్ద యజ్ఞము. ఇది కర్మయజ్ఞము. కాని దురదృష్టవశాత్తు పవిత్రమైన వేదము జ్ఞానమయమైనదిగా ఉండేది కాని దినదినమునకు మారుతూ వచ్చి ఒక వాఙ్మయముగా మారుతూ వచ్చింది. వేదము వాఙ్మయము కాదు. బ్రహ్మమయము. ఈనాడు వాక్కుతో మాత్రమే ఉచ్చరిస్తున్నారు గాని క్రియారూపములో ఏమాత్రము దీనిని నిరూపించటం లేదు. అదే మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనం. మనస్సన్యక్, వచస్సన్యక్, కర్మణ్యన్యక్ దురాత్మనం. లోపలఒకటి బయటఒకటి ఇది కేవలము ఒకవిధమైన మానవత్వముకంటె హీనమైన స్థితి.

ఏది చేసినా దైవాజ్ఞగా నీవు చేయాలి. దైవాజ్ఞ నీవు తు.చ. పాటించాలి. అదియే ఫలితము. దీనికి మించిన ఫలితములేదు. దైవము స్వార్థ రహితమైన భావముతో ఏదిచేసినా జగత్తు కోసమనే చేస్తూ ఉంటాడు. అకారణంగా తాను ఏదీ ఆచరించడు. కారణం లోకకళ్యాణమే. ఇట్టి భావాన్ని మీరు గుర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. కనుక త్యాగభావమును

srisathyasaivachanamrutam

అభివృద్ధి గావించుకోవాలి. మనము ఎవరినో ప్రేమిస్తున్నామనుకోవటం చాలా పొరపాటు. తన ఆనందము నిమిత్తమై తనను తాను ప్రేమిస్తున్నాడు. ఎవరిని ప్రేమించినప్పటికిని ఆత్మను ప్రేమించినట్లుగా భావించటం సరియైన ప్రేమ. ఒకవ్యక్తినిగాని, ఒక విషయమునుగని ఒక పదార్థమునుగాని ప్రేమిస్తున్నానని భావించటము అజ్ఞానము. నేను దప్పియై నీరు త్రాగుతున్నాను. నీరు తృప్తి కోసం నేను నీరు త్రాగుతున్నానా నా తృప్తి కోసం నేను నీరు త్రాగుతున్నాను. ఆకలై అన్నము భుజిస్తున్నాను. ఇది అన్నం తృప్తికోసం కాదు. నా తృప్తికోసం భుజిస్తున్నాను. ఈ విధముగా చిన్నచిన్న విషయములను పరిశీలన చేసుకుంటూ పోతే ప్రతి చిన్న విషయమునందు తన తృప్తే తన ఆనందము తనకు లక్ష్యంగా భావించుకొంటున్నాడు.

**ప్రతికార్యము యజ్ఞమే**

తానంటే ఏమిటి? దేహము కాదు. తానేదేహమైతే ఇది నాదేహమని ఎందుకు చెప్పుకోవాలి. తాను ఆత్మస్వరూపుడే. ఈ ఆత్మనే సర్వత్రా వ్యాపించి ఉంటున్నాది. ఉపాధి భేదము తీసివేస్తే నీవూ నేను రెండూ ఒకటే. ఉపాధివలనే ఈ విధమైన భేదములు అభివృద్ధి అవుతున్నాయి. కనుక సత్యం జ్ఞానమనంతమనే దీనిలో ఉండిన అంతరార్థము గుర్తించుకోవాలి. ఈవిధమైన విచారణ చేస్తూ పోవాలిగాని ఏదోభక్తి భక్తియని భజన చేసినంతమాత్రమున, జపము చేసినంత మాత్రమున కాదు. యజ్ఞము చేసినంత మాత్రమునకాదు. ధ్యానమునకు కూర్చున్నంత మాత్రమునకాదు. మనసును అరికట్టాలి. విశ్వాసమును పెంచుకోవాలి. అట్టి విశ్వాసము లేకుండా ఎన్నిరకములైన సత్కర్మలు ఆచరించినప్పటికిని అవన్నీ వ్యర్థములే. ఆత్మ విశ్వాసముతో నీవు ఏచిన్న కార్యము చేసినప్పటికిని అదే మహత్తర మైన యజ్ఞంగా రూపొందుతుంది. భగవంతుడు ఎప్పుడూ క్వాలిటీ చూస్తాడుగాని క్వాంటిటీ చూడడు. అమృతము ఒక్క చుక్కైనా పవిత్రము. ఇక్కడ చుక్కనా, స్పూనా, టంబ్లరాయని విచారణ చేయనక్కరలేదు. నీవు నిర్మలమైన హృదయంతో నిస్వార్థమైన భావముతో చిన్న కార్యము నాచరించినప్పటికిని అది పెద్ద యజ్ఞముగా రూపొందుతుంది.

ప్రేమస్వరూపులారా! ఎన్ని దినములు మీరు ఉపన్యాసములు విన్నప్పటికిని మనలో మనసు ఎంతవరకు మార్పు చెందింది అనే విషయాన్ని మీరు విచారణ చేయాలి. కేవలము

srisathyasaivachanamrutam

వినటము, ఆ విన్నంతవరకు సంతోషపడటము తిరిగి ఇక్కడ నుండి వెళ్ళిన తక్షణమే మరచిపోవటం. ఇది సరైన పనికాదు. నిజమైన భక్తుడు చేయవలసినది కాదు. ఏ ఒకటి రెండైనా ఆచరణలో పెట్టి క్రమక్రమేణా ప్రాకృతమైన భావాలు కొంతవరకునైనా దూరముగావించుకొని పరతత్త్వము వైపున ప్రయాణము చేసినప్పుడు సహజంగా దివ్యత్వము మీలో వికసిస్తుంది. అంతేగాని దినదినమునకు ప్రాకృతమైన విషయాల్ని బలపరచుకుంటూ, ప్రాకృతమైన సంబంధములను పెంచుకొంటూ ఈ ఆశలు మితిమీరిపోవటం వలనే మానవత్వము క్షీణించి కేవలము పశుత్వముగా మారిపోతున్నది. మానవత్వము నుండి దైవత్వమునకు పోవాలిగాని, మానవత్వము నుండి పశుత్వమునకు దిగరాదు. దీనికంతా మూలకారణము ఆశలే ఆశలే. ఆశలకు ఒక అంత్యమనేదే లేదు. అనిల్ కుమార్ కట్టకడపటికి ఒక ప్రార్థన చేశాడు. నాకు ఎంత ఇచ్చారో అంతా నాకు చాలు. నీకృప ఒక్కటుంటే అంతేచాలు అన్నాడు. అది ఉన్నదో లేదో అది తరువాత విషయము. మనము కోరవలసింది అదియే. ఉన్నదానికి తృప్తి పడాలి. లేని దాని నిమిత్తమై విచారము చేయకూడదు. పోయింది పోయినప్పటికి ఇది కూడా ఒక త్యాగమనే భావించాలి.

ఈనాటి మానవుని అశాంతికి మూలకారణము ఏమిటి? ఉన్నదానిపైన అలక్ష్యము. లేనిదానిపై ఆరాటము. దానివలనే అశాంతి అభివృద్ధి అవుతున్నది. ఉన్నదాన్ని అనుభవించటం లేదు. ఉన్నదాన్ని అలక్ష్యం చేస్తున్నాడు. లేనిదాని విషయమై ప్రాకులాడుతున్నాడు. ఇది ఎంత మూర్ఖత్వము చెప్పండి. ఉన్నదాన్ని అనుభవించు. ఇది అనుభవించటం లేదు. లేనిదానికై ప్రాకులాడటం ఎంత వెఱ్ఱితనము. ఎంత సంపాదించినప్పటికిని ఎన్ని పదవుల నేలినప్పటికిని ఇవన్నీ ఒకనాటికి వ్యర్థమయ్యేవే. మొన్ననే చెప్పాను.

**ఏమితాగొనివచ్చె ఏమితాగొనిపోయె**
**పుట్టినప్పుడు మరి గిట్టునపుడు**
**ధనమునెచ్చటికేగు తానేగునెచ్చటికి**
**తెలుపరయ్యమీరె ఒప్పుకొందు.**

ఎవరైనా చెప్పగలరా? ఊహూ. ఇది ఏనాటికి మనవెంటరాదు అనితెలుసు. దాని నిమిత్తమై

మనము ఎక్కువ ఎందుకు శ్రమలు పడాలి. ఉన్నంతవరకు సుఖజీవనం చేయి. ఉన్నదానిలో దానము ధర్మము గావించాలి. దినదినానికి పెంచుకుంటూ పోతుంటే ఇంక ఏనాటికి మనకు వైరాగ్యం ప్రాప్తించేది. వైరాగ్యమనగా అన్నీ వదలిపెట్టమనికాదు.

**ఆస్తి ఆలివీడి అడవికేగుటకాదు**
**త్యాగమగును అదియె యోగమగును**

దురాశకు గురికారాదు. దురాశ దుఃఖమునే అందిస్తుంది. ఉన్నదానితోనే తృప్తి పడి ఉన్నదానినే మంచి కార్యములలో ప్రవేశపెట్టి త్యాగభావము పెంచుకొని దైవ విశ్వాసము మనం అభివృద్ధి గావించుకోవాలి. ఇదే నిజమైన యజ్ఞము. ఇట్టి బోధలు గావించే నిమిత్తమై ఆనాడు జనక చక్రవర్తి అనేక యాగములు యజ్ఞములు గావిస్తూ వచ్చాడు. ఆనాటి యజ్ఞములకు నేటి యజ్ఞములకు ఎంతో వ్యత్యాసము ఉంటున్నాది. ఇవి ఆడంబరములతోగావించే యజ్ఞములు. అవి ఆత్మానంద నిమిత్తమై చేసే యజ్ఞములు. చేసేవారికి మాత్రమేకాదు చూసేవారికి కూడను ఆత్మతత్త్వాన్ని అర్థమయ్యేరీతిగా బోధించటం జరిగేది. చిత్తమును భగవంతునకు అర్పితముగావించాలి. చిత్తము శుద్ధిచేసుకోవాలి. ఈ చిత్తమును సరియైనరీతిగా చేయమని ప్రార్థించేదే నిజమైన ప్రార్థన.

**(తేది. 07-10-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam